క్లుప్తంగా

నల్లూరులో రెవెన్యూ గ్రామసభ



నల్లూరు రెవెన్యూ గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్

కపిలేశ్వరపురం: మండలంలోని నల్లూరు పంచాయతీలో సోమవారం భూముల రీసర్వే గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ కురుపూడి ఉదయశ్రీ అధ్యక్షతన తహసీల్దార్ చిన్నారావు సమక్షంలో రెవెన్యూ అనుబంధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో పలు సమస్యలపై రైతులు అర్జీలు అందజేశారు. తహసీల్దార్ చిన్నారావు మాట్లాడుతూ రెవెన్యూ, అనుబంధ శాఖల అధికారుల సమక్షంలో దరఖాస్తులను నమోదు చేసి, నిర్దేశిత సమయంలోపు పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, భూ యజమానులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వీఆర్వోకు సత్కారం

కె.గంగవరం: పామర్రులో వీఆర్వోగా విధులు నిర్వహించి బదిలీపై సత్యవాడ గ్రామానికి వెళ్తున్న కె.వెంకటేశ్వరరావును స్థానిక దుర్గమ్మ కమిటీ సభ్యులు సోమవారం ఘనంగా సత్కరించారు. వీఆర్వోగా గ్రామంలోని రైతులకు, భూ యజమానులకు ఎనలేని సేవలు అందించారని పలువురు అన్నారు. కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల సత్యనారాయణ, కమిటీ సభ్యులు వై.దుర్గారావు, మాగాపు చిన్న, అరిశెట్టి అయ్యప్ప, గుర్రాల శ్రీనివాసు, చింతా మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించాలి



అంగరలో మాట్లాడుతున్న సీఐ దొరరాజు

కపిలేశ్వరపురం: ఈనెల 31న దీపావళి నేపథ్యంలో, నిబంధనల మేరకు బాణసంచా విక్రయించాలని మండపేట రూరల్ సీఐ దొరరాజు అన్నారు. మండలంలోని అంగర పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయించే వారిపై చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాలు నిర్వహించేవారు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అందుకోసం ఇసుక, నీరు దుకాణాల వద్ద అందుబాటులో ఉంచుకోవాలన్నారు. దుకాణాల మధ్య మూడు అడుగుల దూరం ఉండేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. వినియోగదారులు దీపావళి రోజున కాటన్ దుస్తులు ధరించడం సురక్షితం అన్నారు. ఆయన వెంట ఎస్సై డి.రవికుమార్ ఉన్నారు.

కల్వర్టు... కలవరపాటు



గొల్లపాలెం చీకట్లవారిపేటలో అసంపూర్తిగా కల్వర్టు నిర్మాణం

కాజులూరు: గొల్లపాలెం శివారు చీకట్లవారిపేటకు వెళ్లే రహదారిలో పంట కాలువపై కల్వర్టు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. బంధనపూడి రోడ్డు నుంచి చీకట్లవారిపేటకు వెళ్లేందుకు పంట కాలువపై కల్వర్టు లేక 12 ఏళ్ల క్రితం గ్రామ పర్యటనకు వచ్చిన అప్పటి ఎమ్మెల్యే పిల్లి సుభాష్‌చంద్రబోస్ కల్వర్టు నిర్మాణానికి పంచాయతీ రాజ్ నుంచి రూ. లక్ష నిధులను మంజూరు చేశారు. నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కాలువపై శ్లాబ్ ఏర్పాటు చేసి దానికి ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించకుండా వదిలేశారు. రక్షణ గోడల కోసం ఏర్పాటు చేసిన ఊచలు బయటకు చొచ్చుకు వస్తూ ప్రమాద భరితంగా ఉన్నాయి. వేగంగా వచ్చే వాహనాలు అదుపుతప్పి రక్షణ గోడలు లేక కాలువలోకి బోల్తా పడుతున్నాయి. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సినిమాలు



ద్రాక్షారామ
సూర్య సినీమ్యాక్స్ : దేవర
శ్రీలక్ష్మి : విశ్వం (2 షోలు), వేట్టయన్ (2 షోలు)

రామచంద్రపురం
రాజగోపాల్ : ఇద్దరు
సూర్య మ్యాక్స్ స్క్రీన్-1 : దేవర
సూర్య మ్యాక్స్ స్క్రీన్-2 : జనక అయితే గనక
కిషోర్ : విశ్వం (2 షోలు), వేట్టయన్ (2 షోలు)

ముక్కంటి సేవకు ముక్కు మూసుకోవాల్సిందే..

- కార్తికం సమీపిస్తున్నా శుభ్రం కాని రేవుల పరిసరాలు
- నియోజకవర్గంలో విశిష్టమైన ఆలయాలెన్నో
- నవంబర్ 2 నుంచి కార్తికం



అపరిశుభ్రత నడుమ అంగర-పడమర ఖండ్రికలోని టేకి డ్రైయిన్ రేవు

కపిలేశ్వరపురం: దేవతామూర్తి దర్శనానికి వెళ్లేముందు పుణ్య స్నానమాచరించడం ఆనవాయితీ. పుణ్య గౌతమి గోదావరి నదిలో స్నానం ఆచరించేందుకు భక్తులు ఆసక్తి చూపుతారు. సాధ్యం కానివారు గ్రామాల్లోని పంట కాలువల్లో స్నానమాచరిస్తారు. కార్తికమాసం పొడవునా భక్తులు పుణ్య స్నానం కోసం రేవులకు వెళ్తారు. అంతటి ప్రాధాన్యత గల కార్తికం మరో నాలుగు రోజుల్లో సమీపిస్తున్నప్పటికీ అందుకు తగిన ఏర్పాట్లు గ్రామాల్లో కానరాని పరిస్థితి.

పవిత్ర ప్రదేశాలివిలా..

మండపేట అర్బన్‌లోని అగస్త్యేశ్వరస్వామి, సీతారామ క్షేత్రం, అయ్యప్ప స్వామి, శివాలయం, ద్వారపూడి అయ్యప్పస్వామి, ఏడిద సంఘమేశ్వరాయలం, కేశవరంలోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి, రాయవరం మండలం సోమేశ్వరంలోని బాలా త్రిపుర సుందరీదేవి సమేత సోమేశ్వరస్వామి, చెల్లూరులోని అగస్త్యేశ్వర స్వామి, వెంటూరులోని ఉమా సమేత సోమేశ్వర స్వామి, వెదురపాక, రాయవరం, మాచవరం, పసలపూడి, గ్రామాల్లోని శివాలయాల్లో కార్తిక పూజలు చేస్తారు. కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లిలోని నాలుగో అష్ట సోమేశ్వరాలయమైన రాజరాజేశ్వరీ దేవీ సమేత సోమేశ్వరస్వామి ఆలయం, కపిలేశ్వరపురంలోని అగస్త్యేశ్వర, పాప వినాసేశ్వర, అంగరలోని సుబ్రహ్మణ్యేశ్వర, పడమర ఖండ్రికలోని ఖణ్వలింగేశ్వరస్వామి, త్రయంబకేశ్వరస్వామి, తాతపూడిలోని మల్లేశ్వర స్వామి ఆలయాల్లో కార్తిక పూజలు ఘనంగా నిర్వహిస్తారు.

భక్తుల స్నానాల రేవులివీ...

మండపేట పట్టణం, రూరల్ గ్రామాల్లో పెద్దకాలువ వద్ద గల రేవు రక్షణ గొట్టాలు విరిగిపోయి ఉన్నాయి. మెహర్ ఆశ్రమం, వీరభద్రపురం వద్ద స్నానాల రేవులకు రక్షణ గోడలు లేక ప్రమాద భరితంగా ఉన్నాయి. అర్తమూరు పంట కాలువలో వినాయకుడి ఆలయం వద్ద గుర్రపు డెక్క పేరుకుపోయింది. రాయవరం మండలం సోమేశ్వరం, మాచర వంతెన వద్ద స్నానాల రేవు, వి.సావరం రాయవరం, వెదురుపాక గ్రామాల మీదుగా ప్రవహించే తుల్యభాగ కాలువ నీరు కలుషితమైంది. కపిలేశ్వరపురం మండలం అంగర, పడమరఖండ్రిక గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో స్నానమాచరించే టేకి డ్రెయిన్ రేవు అపరిశుభ్రంగా ఉంది. పరిసరాలు చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. సంబంధిత అధికారులు స్నానాల రేవులను శుభ్రపరచాలని భక్తులు కోరుతున్నారు. రాత్రి మూడు గంటలకే భక్తులు రేవులను ఆశ్రయించనున్న నేపథ్యంలో విద్యుత్ సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉంది. ఆయా రేవులన్నింటి వద్దా రక్షణ చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

> **కార్తికం ప్రాధాన్యం గుర్తించాలి**
>
> 
>
> కార్తికమాసం ప్రాధాన్యతను గుర్తించి అధికారులు రేవుల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలి. ప్రమాదాలు సంభవించకుండానూ, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలి.
>
> –అతికెల శంభులింగం, నల్లూరు, కపిలేశ్వరపురం మండలం

మెప్మా బజార్లతో మహిళల ఆర్థిక వికాసం

- మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి
- మండపేటలో మెప్మా బజార్ ఏర్పాటు



మెప్మా బజార్ ఉత్పత్తులను వీక్షిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: మహిళల ఆర్థిక పురోగతికి మెప్మా బజార్లు దోహద పడతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు సొంతంగా తయారు చేసిన పలు రకాల ఉత్పత్తులతో సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మెప్మా బజార్ ఏర్పాటు చేశారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పెండ్యాల సుజాత పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ దుర్గారాణి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న ఉత్పత్తులు తయారీ ద్వారా మహిళలకు ఉపాధి లభిస్తుందన్నారు. అనంతరం స్టాల్‌లోని పలు రకాల ఉత్పత్తులను కమిషనర్ రంగారావుతో కలసి చైర్‌పర్సన్ పరిశీలించారు. కొన్నింటిని ఆమె కొనుగోలు చేశారు. కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు యర్రగుంట అయ్యప్ప పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలి



వెల్ల పీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎంపీపీ భవాని

రామచంద్రపురం రూరల్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని రామచంద్రపురం ఎంపీపీ, వెల్ల, ద్రాక్షారామ పీహెచ్‌సీల అభివృద్ధి కమిటీల చైర్మన్ అంబటి భవాని వైద్యులు, సిబ్బందికి సూచించారు. వెల్ల, ద్రాక్షారామ పీహెచ్‌సీల్లో సోమవారం అభివృద్ధి కమిటీల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ భవాని మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను గ్రామాల్లో సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. ఆసుపత్రుల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్ కమిటీ ద్వారా జిల్లాలోనే వెల్ల పీహెచ్‌సీకి సర్టిఫికెట్ రావడం పట్ల వైద్యాధికారులు పెంకే స్వాతి భవాని, వీవీఎల్ ప్రసన్న, సూపర్‌వైజర్లు జి.కమల్‌శేషు, డి.రాజేశ్వరి, సిబ్బందిని అభినందించారు. తాడిపల్లి గ్రామ సర్పంచ్, వెల్ల పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యురాలు పిల్లి అచల రాజశ్రీ, బాలసుబ్రహ్మణ్యం దంపతులు పేషెంట్ వార్డుకు 4 సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. వెల్ల సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ద్రాక్షారామ పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వెలంపాలెం సర్పంచ్ టేకుమూడి సుజాత, వైద్యాధికారులు ఎన్.ప్రశాంతి, సందీప్‌నాయుడు, సూపర్‌వైజర్ నార్ని గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

రామచంద్రపురం: మున్సిపాలిటీలో కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ఈ ధర్నా జరిగింది. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ప్రజారోగ్యం, పర్యావరణం, మున్సిపాలిటీ పరిశుభ్రత కోసం పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులతో పాటు పర్మినెంట్ సిబ్బంది సేవలు చేస్తున్నారన్నారు. కార్మికులకు చట్టబద్ధమైన భద్రతా సౌకర్యాలు కల్పించడం, వాహనాల మరమ్మతులు చేయించడం, రక్షణ పరికరాలు, పనిముట్లు, యూనిఫారాలు, చెప్పులు, సబ్బులు, నూనెలు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారాంతపు, క్యాజువల్, జాతీయ సెలవులు పక్కాగా అమలు చేయాలని, పండగ కానుక రూ.వెయ్యి చెల్లించాలన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలులో ఉన్న లోపాలను వెంటనే సరిదిద్దాలని, మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని, ఆఫ్ కాస్ట్ ద్వారా రిటైర్‌మెంట్ పొందిన కార్మికుల పిల్లలకు ఉపాధి కల్పించాలని, డ్రైవర్లకు రూ.24,500, ఇంజినీరింగ్ కార్మికులకు రూ.21 వేలు జీతాలుగా చెల్లించాలని కోరారు. మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు, వేధింపులను నివారించడానికి సుప్రీంకోర్టు సూచనల మేరకు కంప్లైంట్ కమిటీలను ఏర్పాటు చేయాలని అన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పలుమార్లు విన్నవించినా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని, 15 రోజుల్లోగా సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బాబూరావు, సుబ్బారావు, గుత్తుల తాతారావు, నరసరాజు, వీర్రాజు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి నక్షత్ర కల్యాణం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



రాయవరంలో శ్రీవారి నక్షత్ర కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

రాయవరం: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో నక్షత్ర కల్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వర భక్తజన సంఘం ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఆశ్వయుజ మాసం భూదేవి అమ్మవారి జన్మ నక్షత్రమైన పుబ్బను పురస్కరించుకుని ఈ వేడుక నిర్వహించినట్టు భక్తజనం సంఘం సభ్యులు తెలిపారు. అంగర అయ్యమాచార్యుల ఆధ్వర్యంలో పెద్దింటి కృష్ణమాచార్యులు, అంగర బాబు, అంగర రామకృష్ణ శోభన్‌బాబు, లక్ష్మీనారాయణాచార్యులు తదితర పండితుల అర్చకత్వంలో యజ్ఞ నిర్వహణ చేసి, కల్యాణ విశిష్టతను భక్తులకు వివరించారు. రాయవరం పరిసర గ్రామాలకు చెందిన సుమారు 400 మంది దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. రాయవరం, వెదురుపాక, కొమరిపాలెం, వి.సావరం, లొల్ల, మహేంద్రవాడ తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన



ఎల్ఐసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏజెంట్లు తదితరులు

రామచంద్రపురం: ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలను పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగిస్తామని ఏజెంట్ల సంఘ జిల్లా అధ్యక్షుడు మాధవరావు స్పష్టం చేశారు. ఆల్ ఇండియా ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం పిలుపు మేరకు స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద జరిగిన మహా ధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎల్ఐసీ ఏజెంట్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించక పోతే.. వచ్చే ఏడాది జనవరిలో ముంబయిలో మహా ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. మినిమం ప్రీమియం రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకూ పెంచడం ఏజెంట్ల కమిషన్ తగ్గించేందుకేనన్నారు. నాయకుడు మస్తాన్ మాట్లాడుతూ పాలసీదారుల ప్రవేశ వయసు 55 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు తగ్గించడం పాలసీదారులను ఎల్ఐసీ నుంచి దూరం చేసేందుకేనని అన్నారు. తక్షణమే డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. అనంతరం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.

వీవోఏపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మలికిపురం: మండలంలోని పడమటిపాలెం వీవోఏ యడ్ల సుమలతపై గ్రామంలోని నీ కృపా డ్వాక్రా గ్రూపు సభ్యులు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం గుడిమెళ్లంక టి.సావరం తాగునీటి పథకం పరిశీలనకు వచ్చిన కలెక్టర్‌ను కలసి ఈ మేరకు ఫిర్యాదు పత్రం ఇచ్చారు. వీవోఏ చేసిన అక్రమాలపై అనేక ఫిర్యాదులు చేసినా చర్యలు లేవని గ్రూప్ సభ్యులు వాపోయారు. తమకు ప్రభుత్వం నుంచి అందాల్సిన రూ. లక్షల్లో నగదు వీవోఏ సుమలత దారి మళ్లించిందన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మహేష్ కుమార్ హామీ ఇచ్చారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని డీఆర్‌డీఏ పీడీ శివశంకర ప్రసాద్‌తో మాట్లాడారు. గ్రూపు సభ్యులు ఎస్.గీత, తాడి మేరీ తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

కపిలేశ్వరపురం మండల కార్యదర్శులు

కపిలేశ్వరపురం-1	కె.శివచక్రవర్తి	9948970046
కపిలేశ్వరపురం-2	కె.పండు	9441818405
తాతపూడి	బ్రహ్మాజీరావు	9381725156
అంగర-1	ఆర్‌ఎంవీవీఎస్ ఈశ్వరరావు	9618861999
అంగర-2	మహమ్మద్ అలీ షేక్	9652244131
పడమర ఖండ్రిక	పి.సత్తిబాబు	9676273393
వెదురుమూడి	వై. శారద	8790515028
వల్లూరు	కె.సత్తిబాబు	9959545391
నేలటూరు	పి.మోహన్	8008707882
నిడసనమెట్ట	జి.విజయ్‌కుమార్	9550096513
వడ్లమూరు	పి.వెంకటేశులు	8919435971
నల్లూరు	పి.రమేష్	9618988149
కాలేరు	యు.సుప్రియ	7981281398
అచ్యుతాపురం	జి.దేవీప్రసన్న	550124927
టేకి	కె.రామకృష్ణ	9951480999
టేకి	ఎస్.శ్రీనివాసు	8978306474
కేదారిలంక	కె.యశ్వంత్‌కుమార్	7780276777
మాచర	జి.చినబాబు	99853 84544
కోరుమిల్లి-1	ఆర్ఎస్‌వీ కామేశ్వరరావు	908852108
కోరుమిల్లి-2	కె.శంకరమూర్తి	9502121667
నాగులచెరువు	కె.యశ్వంత్‌కుమార్	7780276777
వాకతిప్ప	పి.వెంకటేశులు	8919435971
అద్దంకివారిలంక	జి.చినబాబు	9985384544

సబ్ జైల్ పరిశీలన



సబ్ జైల్‌ను పరిశీలిస్తున్న జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

రామచంద్రపురం: హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు సోమవారం స్థానిక సబ్ జైల్‌ను పరిశీలించారు. జైలులో అందిస్తున్న సదుపాయాల గురించి ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. జైలు ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సబ్ జైల్ సూపరింటెండెంట్ రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతివైరం మాకేల!



మొగలిపాలెంలో ఆటలాడుతున్న కుక్క, పిల్లి

కాజులూరు: యాంత్రిక జీవనంలో మనుషుల మధ్య స్నేహ బంధాలు కరవవుతున్నాయి. అయితే కాజులూరు మండలం గొల్లపాలెంలో జన్మతహః జాతివైరం కలిగిన వీధికుక్క, పిల్లి ఐక్యతతో మసులుతూ స్నేహ బంధాన్ని చాటుతున్నాయి. పిల్లిని చూడగానే పరుగులు పెట్టించే కుక్క దానితో సఖ్యతగా మసలుతూ ఆటలాడుతుంటే స్థానికులు ఆసక్తిగా చూస్తున్నారు.

డిమాండ్ల సాధనకు పారిశుధ్య కార్మికుల ధర్నా



డిమాండ్లు నెరవేర్చాలని ధర్నా చేస్తున్న కార్మికులు

మండపేట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి కె. కృష్ణవేణి ఆధ్వర్యంలో వారీ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ పట్టణం అంతకంతకూ విస్తరిస్తున్నందున పని భారం పడకుండా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. చనిపోయిన కార్మిక కుటుంబాలకు డెత్ బెనిఫిట్ ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించాలని డిమాండు చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య కార్మికుల కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. చనిపోయిన కార్మిక కుటుంబాలకు మట్టి ఖర్చులు అందివ్వాలని కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ రంగారావుకు వినతి పత్రం అందించారు. ఆందోళనలో సంఘ నాయకులు కొమారపు నరేంద్ర, బంగారు కొండ, పెందుర్తి లోవరాజు, పెట్టా శ్రీను, చిరంజీవి రాజు, చిన్న, అమ్ములు, సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణపై అవగాహన



చెత్త నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ దొరబాబు

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్నాయిపేట గ్రామంలో సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు ఆధ్వర్యంలో మహిళలకు చెత్త నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో వినియోగించిన చెత్తను రెండు వేర్వేరు డస్ట్ బిన్లలో తడి, పొడి చెత్తగా విభజించి పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. దీనివల్ల గ్రామంలో చెత్త నిర్వహణ సక్రమంగా జరుగుతుందని వివరించారు. ఈఓపీఆర్డీ ఎన్.సెలత్‌రాజు, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ లావణ్య మాట్లాడుతూ గ్రామంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించడంలో మహిళల పాత్ర ఎంతో ఉంటుందని వివరించారు. వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖర సూర్యప్రకాశ్ (బాబీ), పంచాయతీ కార్యదర్శి ఎ.వెంకటేష్, సిబ్బంది, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.